గురు వారం
11-01-2024
సంపుటి - 09,
సంచిక - 428
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra P

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

జాతీయ తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన

## తెలంగాణకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానం

### తొలిసారి అధికారికంగా రేవంత్ పర్యటన



**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** తెలంగాణలో అధికారం చేపట్టాక పాలనలో దూకుడు మొదలు పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి పారిశ్రామిక విధానంలోనూ కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహం ఉంటుందని ప్రకటించారు. అలాగే పెట్టుబడులపై దృష్టి సారించారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పారిశ్రామిక, ఐటీ విధానాలపై కసరత్తు చేస్తున్నారు. పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి... దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. దావోస్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ కూడా సిఎంవో విడుదల చేసింది. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఆయన పర్యటిస్తారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. దావోస్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రముఖ గ్లోబల్ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో రేవంత్ సమావేశం కానున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే అవకాశాలు, ప్రయోజనాల గురించి వారికి వివరించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. దావోస్‌లో ప్రతి ఏడాది ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుంది. వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, మల్టీ నేషనల్ కంపెనీల అధినేతలు, పెట్టుబడిదారులు హాజరవుతుంటారు. భారత్ నుంచి ముఖేష్ అంబానీ, ఆనంద్ మహీంద్ర, కుమార మంగళం బిర్లా, గౌతమ్ అదాని.. వంటి పారిశ్రామికవేత్తలు ఈ సదస్సుకు క్రమం తప్పకుండా హాజరవుతుంటారు. కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ సదస్సులో పాల్గొంటుంటారు. తమ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకుని రావడానికి ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఈ ఏడాది తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో దావోస్‌లో జరగనున్న సదస్సుకు రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెళ్లనున్నారు. వాళ్లతోపాటు ముఖ్యమంత్రి కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల వ్యవహారాల విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మీడియా ప్రతినిధి కర్రి శ్రీరామ్, ముఖ్య భద్రతాధికారి తస్ఫీర్ ఇక్బాల్, ఉదయ సింహా, గుమ్మి చక్రవర్తి వెళ్తున్నారు. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే చర్చల్లో తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంపై అంతర్జాతీయ వ్యాపార సంస్థల ప్రతినిధులతో మాట్లాడనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. గత ఏడాది జనవరి మూడో వారంలో చివరి డబ్ల్యూఈఎఫ్ పర్యటన జరగగా... అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలోని బృందం హాజరైంది. ఆ సమయంలో..కేటీఆర్ సుమారు రూ.21వేల కోట్ల పెట్టుబడులను పొందినట్లు సమాచారం. ఈ ఏడాది తెలంగాణలో విదేశీ కంపెనీలు పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం చర్చలు జరపనుంది. విదేశీ పరిశ్రమలను

3వ పేజీలో...

## సంక్రాంతి కోసం ప్రత్యేక బస్సులు

మహిళల ఉచిత ప్రయాణం కొనసాగింపు: సజ్జన్నార్



**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** సంక్రాంతి పండుగ కోసం 4484 బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచామని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ ఎండీ మాట్లాడుతూ.. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. స్పెషల్ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అధిక చార్జీలు

3వ పేజీలో...

## రాహుల్ గాంధీకి మణిపూర్ ప్రభుత్వం షాక్

న్యాయ యాత్రకు అనుమతి ఇవ్వలేమిన వెల్లడి




**న్యూఢిల్లీ, జనవరి 10 (సమ సమాజం):** మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో జనవరి14 నుంచి ప్రారంభమయ్యే భారత్ జోడో న్యాయ్ యాత్రపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, యాత్రకు అనుమతి ఇవ్వలేమని మణిపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది. మణిపూర్ సర్కార్ నిర్ణయంపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. అయితే షెడ్యూల్ ప్రకారమే రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇంఫాల్ లోని మరో ప్రాంతం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంతో మణిపూర్‌లో ప్రారంభమై ముంబైలో ముగియనున్న 'భారత్ జోడో న్యాయ యాత్ర' చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే ఈ యాత్ర ప్రారంభం కాకముందే

3వ పేజీలో...

## ఢిల్లీ గుప్పిట నుంచి తెలంగాణను దక్కించుకోవాలి

కాంగ్రెస్ హామీలను నెరవేర్చడం కష్టమే

కష్టపడితేనే ఎంపి సీట్లను సాధించుకోగలం

పార్టీ నిలవాలంటే మనమంతా గట్టిగా పనిచేయాలి

వరంగల్ సమీక్షలో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్




**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** ఢిల్లీ చేతుల్లోకి వెళ్లిన తెలంగాణను మళ్లీ మన గుప్పిట్లోకి తెచ్చుకోవాల్సి ఉందని, అందుకు పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడమే మార్గమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. అందుకు మనమంతా కలసికట్టుగా కృషి చేయాల్సి ఉందన్నారు. కొన్ని తప్పిదాల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓటమి పాలయ్యాం. ఇప్పుడు ఢిల్లీ చేతుల్లోకి తెలంగాణ వెళ్ళింది. మన తెలంగాణ మన చేతుల్లోకి తెచ్చుకునే సమయం ఆసన్నమైంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. తెలంగాణ గళం, బలం డిల్లీలో వినిపించాలంటే మనం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందని కెటిఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ సమీక్ష సమావేశం 8వ రోజు తిరిగి ప్రారంభమైంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య

3వ పేజీలో...

## సిఎం రేవంత్‌తో అమెజాన్ ప్రతినిధుల భేటీ



**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** డా.బీఆర్ఎస్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో అమెజాన్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ భేటీలో తెలంగాణలో పెట్టుబడులపై అమెజాన్ ప్రతినిధులు సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు.

## నాంపల్లిలో పట్టాలు తప్పిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్

- పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు
- పలు ఎంఎంటిఎస్ రైళ్ల రద్దు




**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** హైదరాబాద్ నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన రైలు నాంపల్లి స్టేషన్‌లో ఆగే క్రమంలో డెడ్ ఎండ్ గోడను ఢీకొట్టింది. దాంతో రైలులోని మూడు బోగీలు పట్టాలు తప్పి పక్కకు వెళ్లాయి. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.నాంపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంతో పలు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దయ్యాయి. హైదరాబాద్ (నాంపల్లి) నుంచి మేడ్చెల్ (47244), మేడ్చల్ నుంచి హైదరాబాద్ (47251) ఎంఎంటీఎస్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై.. దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ రాకేష్ మాట్లాడుతూ.. ట్రైన్ డెడ్ ఎండ్‌ను ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఎస్ టూ, ఎస్ త్రీ, ఎస్ సిక్స్ బోగీలు ఈ ప్రమాదంలో పట్టాలు తప్పాయన్నారు. రైలు ప్రమాదంపై దర్యాప్తు

3వ పేజీలో...

# ఎసిబికి చిక్కిన తహసిల్దార్




నిర్మల్, జనవరి 10 (సమ సమాజం): సాగు భూమిని పట్టా చేసేందుకు లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కొత్త మద్దిపడగా గ్రామానికి చెందిన లశెట్టి రాజన్న అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమి 35 గుంటలను పట్టా చేసేందుకు తహసీల్దార్ రాజేశ్వరిని కలివారు. పట్టా చేయాలంటే రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీంతో చేసేదేమి లేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు ఒప్పందంలో భాగంగా నాయబ్ తహసీల్దార్‌కు రూ.9 వేలు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశం మేరకు తాను డబ్బులు తీసుకున్నట్టు నాయబ్ తహసీల్దార్ చిన్నయ్య తెలిపారు. అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల్లో లబ్ధిదారులకు న్యాయం

### ఆరు గ్యారెంటీలను అమలుచేసి తీరుతాం: తుమ్మల



ఖమ్మం, జనవరి 10 (సమ సమాజం): గత ముఖ్యమంత్రి మాటలకే పరిమితమై ప్రజాసంక్షేమ కార్యక్రమాలు తుంగలో తొక్కారని మాజీ సిఎం కెసిఆర్‌పై మంత్రి తుమ్మల విమర్శించారు. ఈనాటి ముఖ్యమంత్రి ప్రజల వద్దకు పంపించి ప్రజల ముందే ఆ కార్యక్రమాలు చేసుకోమని చెప్పారన్నారు. ఆరు గ్యారెంటీలు పేద ప్రజలు కోరుకునే కనీస అవసరాలని చెప్పుకొచ్చారు.ఎంత డబ్బు, అహంకారం, అధికారం ఉన్నా ప్రజల ముందు దిగదుడుపే అని తెలంగాణ ప్రజలు నిరూపించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అందరం ఏది కాదనుకున్నామో, వద్దనుకున్నామో దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో ఎవరైతే నిజంగా అర్హులో వారిని గుర్తించాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు కూడా నిజమైన అర్హులకు ఇస్తే అది ఇందిరమ్మ రాజ్యం అవుతుందన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటకాలానికి ఖమ్మం జిల్లాలోకి గోదావరి జలాలు ప్రవేశిస్తాయని స్పష్టం చేశారు. తప్పకుండా మా పదవీ కాలంలోనే ఆ నీళ్లు మీకు రావాలని మేము ప్రయత్నం చేస్తున్నాం అని చెప్పారు. జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం అన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాము తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# వైసిపికి మరో బిగ్ షాక్

### కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్ రాజీనామా



విజయవాడ, జనవరి 10 (సమ సమాజం): వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి కర్నూలు ఎంపీ డా.సంజీవ కుమార్ రాజీనామా చేశారు. అలాగే ఎంపీ పదవికి కూడా రాజీనామా చేశారు. రెండు రోజుల్లో లోక్సభ స్పీకర్‌ను కలిసి రాజీనామా లేఖ సమర్పిస్తానని వెల్లడించారు. బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్నూలులో వలసలు, ఆత్మహత్యలు ఆగాలనేది.. కర్నూలు నుంచి బళ్లారి వరకు జాతీయ రహదారి సాధించాలనేది నా లక్ష్యమని తెలిపారు. పరిధిలో ఉన్నంత వరకు నేను పనులు చేశానని.. వలసలు ఆగాలంటే పెద్దస్థాయిలో నిర్ణయాలు జరగాలని తెలిపారు. ఏ పార్టీలో చేరాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని.. సన్నిహితులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కర్నూలు ఎంపీ టికెట్ను మంత్రి జయరాంకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. దీంతో మనస్తాపం చెందిన ఆయన వైసీపీకి రాజీనామా చేసినట్లు సమాచారం. ఏపీలో ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల రాజీనామాల పర్వం కొనసాగుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల మార్పు భారీ ఎత్తున చేపట్టడంతో అవకాశాలు రాని నేతలు పార్టీలు మారుతున్నారు. ఇందులో కర్నూలు పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించి మంత్రి జయరాంకు అప్పగించడం పట్ల ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో బుధవారం వైసీపీ సభ్యత్వానికి , ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన పరిధిలో పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశానని అన్నారు. వైఎస్ జగన్ అపాయింట్‌మెంట్ కోరితే ఎందుకు కష్టపడతావని అనడం తనను బాధించిందని అన్నారు. గడిచిన ఐదేండ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయించలేక పోయానని వెల్లడించారు. వైసీపీలో కొనసాగుతూ పనులు చేయలేననేది తన అభిప్రాయమని పేర్కొన్నారు.

# టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలు

### ఆమోదించిన గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్





హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): టీఎస్‌పీఎస్సీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలకు గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడ్డాక కొన్ని రోజులకు ఛైర్మన్ పదవికి జనార్థాన్ రెడ్డి రాజీనామా చేశారు. అనంతరం ఒక్కొక్కరిగా సభ్యుల రాజీనామా చేస్తూ వచ్చారు. తమ రాజీనామా లేఖలను గవర్నర్‌కు పంపించారు. అప్పటి నుంచి ఈ రాజీనామాలు గవర్నర్ వద్దే పెండింగ్ లో ఉన్నాయి. తాజాగా వాటిని గవర్నర్ ఆమోదించారు. దీంతో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియమాకానికి లైన్ క్లియర్ అయింది. కొత్త సభ్యుల నియమాకం తరువాత జాబ్ నోటిఫికేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఛైర్మన్, ఐదుగురు సభ్యుల రాజీనామాలను గవర్నర్ తమిళిసై బుధవారం ఆమోదించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్ ఛైర్మన్ బి.జనార్థన్‌రెడ్డి రాజీనామా చేశారు. కాగా, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలను వెంటనే ఆమోదించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. ఆ మేరకు గవర్నర్ తమిళిసైకి ఆయన లేఖ రాశారు. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలు చేసి నెల రోజులు గడుస్తున్నా.. గవర్నర్ వాటిని ఇంత వరకు ఆమోదించడం లేదని అన్నారు. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ లేకపోవడంతో ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ బుధవారం టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలకు ఆమోదం తెలిపింది.

# ఆధ్యాత్మిక నగరిగా అయోధ్య

### దీపావళి వెలుగుల్లా ప్రతిష్టాపన

భారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టిన పోలీసులు

ఏటా ప్రతిష్టాపన చేపడతామన్న సిఎం యోగి



అయోధ్య, జనవరి 10 (సమ సమాజం): అంతారామమయం..ఈ జగమంతా రామమయం అన్నట్లుగా అయోధ్య సర్వాంగ సుందరంగా..ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకుంటోంది. ఎక్కడ చూసినా రామాయణం తాండవిస్తోంది. 22న ఆలయ ప్రతిష్టాపనకు చురుకుగా ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. అయోధ్యలో అడుగుపెట్టగానే ఆధ్మాత్మిక వాసనలు కనిపిస్తున్నాయి. అయోధ్యలో ఈనెల 22న నూతన రామాలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ముమ్ముందు అయోధ్యలో అనేక అభివృద్ధి పనులు జరగనున్నాయి. తాజాగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విలేకరుల సమక్షంలో అయోధ్యలో అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అయోధ్యలో సెవెన్ స్టార్ హోటల్ నిర్మిస్తామని, దానిలో శాకాహారం అందిస్తామని యూపీ సీఎం యోగి తెలిపారు. అలాగే ప్రతీయేటా అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ ఉత్సవం నిర్వహిస్తామని అన్నారు. ఎప్పుడో పదేళ్ల క్రితమే జరగాల్సిన ఉత్సవం ఇప్పుడు జరుగుతోందని అన్నారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే ఉత్సవం వెలుగుల పండుగ దీపావళి లా ఉంటుందని అన్నారు. అయోధ్యలో హోటళ్ల ఏర్పాటుకు సంబంధించి 25కు పైగా ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వాటిలో ఒకటి కేవలం శాకాహారం అందించే సెవెన్ స్టార్ హోటల్ అని తెలిపారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక అధికారులతో చర్చించామని అన్నారు. అయోధ్యకు దేశంలోని నలుమూలల నుంచి రోడ్డు, విమాన, రైలు కనెక్టివిటీ ఏర్పడిందన్నారు. వీధి వ్యాపారుల వ్యాపార నిర్వహణ కు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అయోధ్యలో గ్రీన్ కారిడార్ నిర్మిస్తామని, రామభక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గత రామనవమికి ఐదు లక్షల మంది భక్తులు అయోధ్య కు వస్తారని అంచనా వేయగా, ఆ సంఖ్య 35 లక్షలు దాటిందని ముఖ్యమంత్రి తెలిపారు. అయోధ్యకు వచ్చే రామభక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ క్రమంలో ఈ నెల 22న జరగనున్న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా.. అయోధ్య విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం భారీగా భద్రత పెంచింది. 150 మందికి పైగా సిబ్బందిని సీఐఎస్ఎఫ్ యాంటీ టెర్రరిస్ట్ కవర్‌ను మంజూరు చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలో 68 వ విమానాశ్రయ టెర్మినల్‌గా మారింది. 2023 డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన అయోధ్య విమానాశ్రయా నికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) భద్రత అందించనుంది. ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎయిర్ గేట్‌వే సదుపాయానికి ముప్పు ఉన్న నేపథ్యంలో ఎయిర్ పోర్టుకు భద్రత కల్పిస్తున్నట్లు సీఐఎస్ఎఫ్ వెల్లడించింది. ప్రారంభోత్సవం సందర్భంగా దేశ విదేశాల నుంచి పలువురు రానున్నందున అయోధ్యలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టు కు సెక్యూరిటీ కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే ఈ సంఖ్యను మరింత పెంచుతామన్నారు. మొదటి దశలో, విమానాశ్రయం 65,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. గంటకు రెండు నుంచి మూడు విమానాలు రాకపోకలు సాగించేలా నిర్మించారు. బోయింగ్ 737, ఎయిర్‌బస్ 319, 320 ఈ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. రెండో దశలో రన్‌వే పొడవు 2,200 మీటర్ల నుంచి 3,700 మీటర్లకు పెరుగుతుంది. తద్వారా బోయింగ్ 787, బోయింగ్ 777 వంటి అంతర్జాతీయ విమానాలు అయోధ్యలో ల్యాండ్ అవుతాయి. 50,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎయిర్ పోర్టు విస్తరించి ఉంటుంది.

# క్షేత్రస్థాయి అధ్యయనంతోనే భూ సమస్యలకు చెక్ !

రోగం ఏమిటో తెలిస్తే...మందు వేయడం సులభం. అందుకే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మెల్లగా సమస్యలను గుర్తించి..పరిష్కరించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ధరణిలో భూ సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు వేసింది. ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా... ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ధరణి పేరుతో భూముల రిజిస్ట్రేషన్ల లో జరిగిన అవక తవకలను కూడా ప్రభుత్వం వెలికితీయనుంది. అయితే ఇందులో పట్టా బూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములను కూడా గుర్తించాల్సి ఉంది. అలాగే బక్కరైతుల భూములను బలవంతంగా లక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములను కూడా కమిటీ గుర్తించాలి. ఇందు కోసం కొత్తగా ఏర్పడ్డ కమిటీ గ్రామాల వారీగా వివరాలు నమోదు చేయాలి. అన్యాయం అయిందన్న వారు దరఖాస్తులు చేసుకునే వెసులబాటు ఉండాలి. ధరణిలో ఎక్కినంత మాత్రాన తమకు ఢోకా లేదన్న భావన లేకుండా చేయాలి. ధరణి స్థానంలో భూమాతను తీసుకొస్తామని కూడా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించింది. ఈ క్రమంలో ముందుగా ధరణిలో సమస్యలను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో పేరుకు పోయన భూ సమస్యలకు కారణమైన పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేస్తే తప్ప పరిష్కారం సాధ్యంకాదని, రెవెన్యూ అకారులు కూడా ప్రభుత్వానికి ఇప్పటికే సూచించారు. పోర్టల్‌లో సాంకేతికంగా అనేక సమస్యలు ఉన్నాయని నివేదించారు. దీంతో ధరణి పోర్టల్‌లో సమస్యలను తొలగించి సరికొత్తగా రూపొందించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడం ఓ మంచి అడుగుగా భావించాలి. చిత్తశుద్దితో సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించాలి. ఈ దిశగా ఐదుగురు సభ్యుల కమిటీ పనిచేయగలగాలి. సమాచారం తెప్పించు కుంటే.. అధ్యయనం చేయడం సులువు కాగలదు. కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం... తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది కనుక సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగాలి. ధరణిపై వేసిన కమిటీలో కన్వీనర్‌తోపాటు నలుగురు సభ్యులను నియమించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్... నవీన్ మిత్తల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రైతుల సమస్యలపై పట్టున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌గా పని చేసిన రేమండ్ పీటర్‌ను ఈ కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించింది. భూ చట్టాల నిపుణుడు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యుడు సునీల్, రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉన్న రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌ను కూడా ఈ కమిటీలో నియమించారు. ఈ కమిటీ... ధరణి పోర్టల్లోని సమస్యలను గుర్తించి.. వారికి పరిష్కారాలను కనుగొని ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ నివేదిక ఇవ్వాలని.. కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని భూ సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కమిటీ పనిచేయనుందని పేర్కొన్న దరిమిలా సమస్యలపై ఫిర్యాదులను కూడా స్వీకరించాలి. ఏ భూములు ఎలా అక్రమాలకు గురయ్యాయో సమాచారం కూడా తెప్పించుకోవాలి. అలాగే గత బిఆర్ఎస్ పెద్దలు అక్రమంగా ఆక్రమించుకున్న భూములపైనా విచారణ జరగాలి. చెరువుల శిఖాలను ఆక్రమించుకుని బహుళ అంతస్థులు కట్టుకున్న వారి చిట్టాలను కూడా తీయాలి. ప్రధానంగా హైదరాబాద్ లాంటి నగరంలో చెరువులు మాయం అయ్యాయి. చెరువు శిఖాలను మాయం చేశారు. ఇవన్నీ కూడా బయటపడాలి. అప్పుడే ధరణి సంస్కరణలకు అర్థం ఉంటుంది. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు దోచుకుందని కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది. అధికారంలోకి వస్తే... ధరణిని బంగాళాఖాతం వేస్తామని

పదేపదే ప్రకటించింది. ధరణి పోర్టల్లో భూముల ఖాతాలు ఉన్న వారికే పట్టా పాసు పుస్తకాల జారీ చేస్తున్నారు. ధరణి వెలుపల 18 లక్షల మంది వరకు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ధరణి పోర్టల్‌తో లక్షల్లో పెండింగ్ సమస్యలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వీటన్నింటిపై సమగ్రంగా అధ్యయనం చేసి పోర్టల్‌ను పునర్నిర్మించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. కొత్త సమస్యలు తలెత్తకుండా... ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుకోవడంలో ఈ కమిటీ సమగ్రంగా పనిచేయాలి. ఇప్పటికే ధరణి పోర్టల్‌లో 33 మాడ్యూళ్లను అమల్లోకి తీసుకొచ్చినా... భూముల సమస్యలు పరిష్కారం కాలేదు. అందుకే భూమాత పోర్టల్ తీసుకురావడానికి ముందే... ఉన్న సమస్యలకు పరిష్కరించి.. అవి మళ్లీ తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పట్టా భూములతో పాటు అన్ని రకాల భూముల సమస్యలను పరిష్కరించ గలిగేలా చూడాలి. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ జిల్లాల్లో పర్యటించి.. భూ సమస్యలపై అధ్యయనం చేయాలి. కమిటీకి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రభుత్వం సూచించింది. భూ సమస్యల మూలాలను కనుగొని... వాటి పరిష్కారాలపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇకపోతే ప్రధానంగా దేవాదాయ, వక్ఫ్ భూములను కాజేశారు.

ఇటీవలి భూసమగ్ర సర్వేలా జిల్లాల వారీగా దేవాదాయ భూమల గుర్తింపు స్వాధీనంపై తెలంగాణ దేవాదాయ శాఖ ప్రకటన చేయలేకపోయింది. ఏ గ్రామంలో ఎంత భూమి ఉందో గుర్తించిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాల్లో కోట్ల విలువైన భూములు ఉన్నా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పడం లేదు. అలాగే అర్చక సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు కూడా క్షేత్రస్థాయి వివరాలను ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు. ఆలయ భూములు అన్యాక్రాంతం అయినా,ఆలయాల్లో ధూపదీప నైవేద్యం కరువైనా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలో సర్పంచ్‌లు కూడా దేవాదాయ భూముల గురించి తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. జిల్లా ఎండోమెంట్ అధికారులు కూడా ఇలాంటి వాటి జోలికి వెళ్లడం లేదు. అసిస్టెంట్ కమిషనర్లు ఉత్సవ విగ్రహాల్లో ఆలయ భూముల అన్యాక్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల విలువైన భూములను కాపాడే క్రమంలో తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వెనక..కబ్జాల మోసం దాగివుంది. పదేళ్ల కెసిఆర్ పాలనలో కనీసం ఒక్క ఎకరా కూడా స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో మాన్యాలను మింగేసిన ఘనుల భరతం పట్టాలి. గుళ్ల పేరుతో ఉన్న ఆస్తులను కొందరు అక్రమార్కులు కబ్జా చేసుకున్నారు. ధరణిలో తమపేరుతో ఎక్కించే సుకున్నారు. ఇలా వేల ఎకరాల వరకు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ ఇప్పుడు వేలకోట్లల్లో

ఉంటుందని అంచనా. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కౌలు చెల్లించే విధంగా వేలం కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొంది. ఇలాంటి భూములను కూడా గుర్తించి స్వాధీనం చేసుకుని కబ్జాచెరకు విముక్తి కలిగించాలి.

# తప్పులు బయటపడడంతో విమర్శలా

### బిఆర్ఎస్ నేతల తీరుపై సీతక్క ఆగ్రహం



నిర్మల్, జనవరి 10 (సమ సమాజం): గత పదేళ్లలో తమ తప్పులు బయటపడడంతో బిఆర్ఎస్ నేతలు ఉలిక్కి పడుతున్నారని మంత్రి సీతక్క అన్నారు. అప్పులకుప్పగా తెలంగాణను అథమస్థానంలోకి నెట్టారని మండిపడ్డారు. స్వార్థం కోసం తెలవంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టారని అన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులలో మహిళల ఉచిత ప్రయాణాన్ని బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు గట్టిగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసి తీరుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తీర్చాలన్నారు. రాష్ట్రం బాగుండాలంటే కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్‌ను గెలిపించాలని మంత్రి సీతక్క కోరారు.

# కార్యకర్త కాలపై నుంచి కెకె కారు

హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం 'తెలంగాణ భవన్' వద్ద ప్రమాదం జరిగింది. ఎంపీ కే.కేశవ రావు కారు ఓ కార్యకర్త కాలు పైనుంచి వెళ్లింది. భూపాలపల్లి నియోజకవర్గం చల్పూర్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి కాలుపై నుంచి వెళ్లడంతో అతడు గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై బాధితుడు శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే ఎంపీ కేశవరావు వెంటనే స్పందించారు. కారు దిగి వచ్చి పరామర్శించారు. శ్రీనివాస్ రెడ్డిని చికిత్స కోసం తక్షణమే ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి బాధ్యుడైన కారు డ్రైవర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డ్రగ్స్ అమ్ముతున్న బిటెక్ విద్యార్థి అరెస్ట్



హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): రాజస్థాన్ నుంచి డ్రగ్స్ హైదరాబాద్‌కు వస్తుందని రాచకొండ సిపి సుధీర్ బాబు తెలిపారు. బీఫార్మసీ విద్యార్థి అశోక్ కుమార్‌తో పాటు ఓ మైనర్‌ను అరెస్ట్ చేశామని, రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టి హెరాయిన్‌ను తీసుకొచ్చారన్నారు. లారీ డ్రైవర్లు, విద్యార్థులకు హెరాయిన్ డ్రగ్ అమ్మారన్నారు. రూ.5 వేలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ.20 వేలకు అమ్మారని పేర్కొన్నారు. 50 గ్రాముల హెరాయిన్‌ను సీజ్ చేశామన్నారు.

# విద్యార్థులు లక్ష్యంగా మత్తు చాక్లెట్లు

### ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలో మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్న షాపు యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. మత్తు చాక్లెట్ల విక్రయంపై పోలీసులు బుధవారం దర్యాప్తు చేశారు. వీటిని విక్రయిస్తున్న పాన్ షాప్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. కొత్తూరు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. కొత్తూరు ప్రభుత్వ పాఠశాల వద్ద ఓ వ్యక్తి పాన్ షాప్ నడుపుతూ విద్యార్థులకు అమ్ముతున్నాడు. చాక్లెట్లు తిని పాఠశాల విద్యార్థులు మత్తులోకి జారుకుంటున్నారు. మత్తులో కొన్నాళ్లుగా విద్యార్థులు వింతగా ప్రవర్తిస్తున్నారు. అనుమానం వచ్చిన పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన ఎస్వోటీ పోలీసులు పాన్ షాప్ పై దాడి చేసి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. చాక్లెట్లలో గంజాయి కలిపినట్లు పోలీసులు గుర్తించారు. పాన్ షాపులో 8 కిలోల చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 1.30 లక్షల విలువైన 42 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

# నాంపల్లిలో పట్టాలు తప్పిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్




(మొదటి పేజీ తరువాయి) చేస్తున్నామని.. ఇప్పుడే ప్రమాదానికి కారణాలు చెప్పలేమని అన్నారు. రైలు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారని వారికి రైల్వే హాస్పిటల్‌లో చికిత్స కొనసాగుతోందని అన్నారు. ప్రయాణికులంతా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోనే దిగిపోయారని రాకేష్ తెలిపారు. రైలు ప్రమాదంతో నాంపల్లికి వచ్చే పలు ఎంఎంటీఎస్ రైళ్ళను రద్దు చేశామన్నారు. రైలు ప్రమాదంపై కమిటీ దర్యాప్తు చేస్తోందన్నారు. పునరుద్ధరణ పనులు పూర్తి అవుతాయని రాకేష్ వెల్లడించారు.

# పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన




(మొదటి పేజీ తరువాయి) ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సౌకర్యాలను ఈ బృందం వివిధ కంపెనీల ప్రతినిధులకు వివరించనుంది. ఐటీ, ఫార్మా, బయో, ఏరోస్పేస్, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో అవలంబిస్తున్న విధానాలు, విదేశీ పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యత వంటి అంశాల గురించి వివరించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# సంక్రాంతి కోసం ప్రత్యేక బస్సులు



(మొదటి పేజీ తరువాయి) వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎంజీబీఎస్ నుంచి మాత్రమే కాకుండా ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. మహాలక్ష్మి స్కీం వల్ల ఈసారి ఏపీకి బస్సుల సంఖ్య తగ్గించామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# పెండింగ్ చలాన్ల గడువు 31 వరకు పొడిగింపు



హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): వాహనాల పెండింగ్ చలాన్ల గడువును ప్రభుత్వం పొడిగించింది. బుధవారంతో గడువు ముగుస్తుండటంతో జనవరి 31 వరకు గడువును పెంచుతున్నట్లు ప్రకటించింది. పెండింగ్ చలాన్లు చెల్లించనివారు గడువులోగా చెల్లించాలని సూచించింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు 80 శాతం డిస్కౌంట్,ఆర్టీసీ బస్సులకు 90 శాతం ,ఇతర వాహనాలకు 60 శాతం డిస్కౌంట్ ను ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణలో పెండింగ్ చాలాన్లపై ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించినా.. వాహనాదారులు మాత్రం పేమెంట్స్ కు ఆసక్తి చూపలేదు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు పెండింగ్ చలాన్లపై భారీ డిస్కౌంట్స్ ప్రకటించింది. అయితే, వాహనాదారులు ఈ ఆఫర్ ను వినియోగించుకునేందుకు పెద్దగా ముందుకు రాలేదు. 14 రోజుల్లో 32 శాతమే పేమెంట్ చాలాన్లు కట్టారు వాహనదారులు. 3 కోట్ల 59 లక్షల పెండింగ్ చాలాన్లు ఉంటే.. కోటీ 14 లక్షలు మాత్రమే క్లియర్ చేశారు . దీంతో రూ.100 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో 45 రోజుల్లో 60 శాతం చాలాన్లు క్లియర్ చేయడంతో 200 కోట్లు వచ్చాయి. జిల్లా, గ్రామాల్లో పెండింగ్ చలాన్ పేమెంట్స్ తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

# తెలంగాణలో ప్రజలు కోరుకున్న పాలన

## నిరుద్యోగుల కల సాకారం చేస్తాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం, జనవరి 10 (సమ సమాజం): ప్రజా పాలనతో పాటు మనం కోరుకున్న ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మ్లలెమడుగులో పల్లె దవాఖానా ప్రారంభోత్సవం సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంతో పేదలకు మంచి జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మాటలతోనే కాకుండా పేదలకు ఇచ్చిన గ్యారెంటీలను చేసి చూపిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వ అధికారులే ప్రజల వద్దకు వస్తారని పొంగులేటి తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తులతో పేదల న్యాయమైన కోరికలను ఈ ప్రభుత్వం తీర్చుతుందన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని మాటలు చెప్పి తప్పించుకునే ప్రభుత్వం కాదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా పేదలకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేర్చుతామని పొంగులేటి తెలిపారు. బిఆర్ఎస్ రూ.6 లక్షల కోట్ల అప్పు చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. టిఎస్‌పిఎస్‌సి ప్రక్షాళనకు తొలి అడుగు పడిందని, గతంలో నిరుద్యోగులు వివక్షకు గురయ్యారని, నిరుద్యోగులందరూ కలిసి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని ప్రశంసించారు. ఈ ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

# రాహుల్ గాంధీకి మణిపూర్ ప్రభుత్వం షాక్




(మొదటి పేజీ తరువాయి) కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వాస్తవానికి, యాత్ర ఎక్కడ నుండి ప్రారంభించాలో మణిపూర్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. ఈ యాత్ర జనవరి 14 నుంచి ప్రారంభం కానుంది. కానీ ఇప్పటికీ అనుమతి లేకపోవడంతో ప్రయాణం ప్రమాదంలో పడింది. మణిపూర్ ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. ఇది రాజకీయ ప్రయత్నం కాదని, యాత్రను రాజకీయం చేయవద్దని ఆయన అన్నారు. మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె మేఘచంద్ర, పార్టీ నేతల బృందంతో కలిసి బుధవారం ఉదయం ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్‌ను కలిశారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని సాకుగా చూపుతూ భేటీ సందర్భంగా సీఎం అనుమతి నిరాకరించారని అన్నారు. ఇదిలావుంటే మణిపూర్ నుంచి ముంబై వరకు 6,500 కిలోమీటర్ల మేర సాగే ఈ చారిత్రాత్మక యాత్ర యువత, మహిళలు, రైతులు, పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర దేశంలోని 15 రాష్ట్రాల గుండా ముంబయిలో ముగుస్తుంది. ఇప్పుడు ఈ యాత్ర మార్గంలో అరుణాచల్ ప్రదేశ్ కూడా చేర్చారు.

## 22న అయోధ్యలో మద్యం, మటన్ షాపుల మూసివేత

అయోధ్య,జనవరి10(సమ సమాజం): ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ట మహోత్సవానికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వేడుకను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉత్తర్ ప్రదేశ్ లోని యోగి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ట రోజున రాష్ట్రంలో మద్యం షాపులు మూసేయాలని ఆదేశాలు జారీ చేసింది. మాంసాన్ని కూడా అమ్మరాదని స్పష్టం చేసింది. అదే విధంగా స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించింది. కాగా అయోధ్యలో ఆరంచెల భద్రత వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 600 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తోంది.

# చంద్రబాబుకు హైకోర్టులో భారీ ఊరట

## రీజినల్ రింగ్ రోడ్డు, మద్యం, ఉచిత ఇసుక కేసుల్లో

## ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు

## మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ శ్రీనరేష్‌కు బెయిల్



అమరావతి, జనవరి 10 (సమ సమాజం): తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. బుధవారం నాడు హైకోర్టులో చంద్రబాబుపై ఉన్న మూడు కేసులపై విచారణ జరిగింది. ఈ విచారణలో హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఒకేసారి మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రీజినల్ రింగ్ రోడ్డు, మద్యం, ఉచిత ఇసుక కేసులల్లో ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనరేష్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు తరపున సీనియర్ కౌన్సిల్స్ సిద్దార్థ లూథ్ర.. దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఐఆర్ఆర్, మద్యం, ఇసుక కేసుల్లో చంద్రబాబు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపి ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు.ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేసిన తర్వాత.. మరికొన్ని కేసులు తెరపైకి వచ్చాయి.. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు, మద్యం కేసు, ఇసుక కేసు.. ఇలా పలు కేసుల్లో సీఐడీ వరుసగా కేసులు నమోదు చేసింది.ఈ మూడు కేసుల్లో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మొదట మధ్యంతర బెయిల్ పొందిన చంద్రబాబుకు ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ కూడా మంజూరు చేసింది. ఇక, ఐఆర్ఆర్, మద్యం కేసు, ఇసుక కేసుల్లో చంద్రబాబుపై సీఐడీ కేసులు నమోదు చేయగా.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.. ఈ కేసుల్లో విచారణ పూర్తి చేసి తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ పై గతంలో హైకోర్టు విచారణ జరిపి తిరస్కరించింది. కేసు విచారణ కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని చెప్పింది. దీనిపై సుప్రీంకోర్టులో చంద్రబాబు పిటిషన్ దాఖలు చేశారు. అయితే క్వాష్ పిటిషన్ పై తీర్పు ఇవవాల్సి ఉన్నందున విచారణ జరగడం లేదు. కానీ ఆ కేసులో అరెస్టులు చేయవద్దని స్పష్టం చేసింది. సీఐడీ తనపై నమోదు చేసిన కేసులు పూర్తిగా కుట్ర పూరితమని ..ఒక్క సాక్ష్యం లేకండా.. తప్పుడు ఆరోపణతో కేసులు నమోదు చేశారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు. తనపై కేసులు నమోదు చేయాలంటే ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాలని తనకు సెక్షన్ 17ఏ వర్తిస్తుందని.. చంద్రబాబు సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనలు జరిగిన తర్వాత క్వాష్ పిటిషన్ పై తీర్పును సుప్రీం కోర్టు రిజర్వ్ చేసింది. చంద్రబాబు తరపున సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే, ఏపీ సర్కార్ తరపున సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. అక్టోబర్ 18వ తేదీన ఈ క్వాష్ పిటిషన్ తీర్పు రిజర్వ్ చేశారు. ఇంత కాలం తీర్పు వెల్లడించలేదు. ఎప్పుడు వెల్లడిస్తారో స్పష్టత లేదు.ఈ లోపు చంద్రబాబుకు హైకోర్టులో ఊరట లభించింది.


# ఢిల్లీ గుప్పిట నుంచి తెలంగాణను దక్కించుకోవాలి



(మొదటి పేజీ తరువాయి) అతిథులుగా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, కడియం శ్రీహరి,పోచారం శ్రీనివాస రెడ్డి, మధు సుధనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు.సమావేశానికి లేటుగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ వచ్చారు. ఈ క్రమంలోనే వినయ్ భాస్కర్‌కు కేటీఆర్ చురకలు అంటించారు. అసెంబ్లీకి లేటే, మీటింగ్‌కు లేటేనా అని ప్రశ్నించారు. ఇక ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాము. తల్లడిల్లి ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 10 ఏళ్ల పాటు చల్లగా కాపాడుకున్నాం. ఇప్పుడు మళ్లీ మనం పట్టు సాధిస్తేనే మనగలుగుతామని అన్నారు. స్వల్పకాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే లక్షణం కాంగ్రెస్ పార్టీ సొంతమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆ పార్టీ గత చరిత్రను పరిశీలిస్తే అర్థమయ్యేది అదేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి గల కారణాలను లోతుగా విశ్లేషించారు. లోటుపాట్లు సవరించుకుంటే భవిష్యత్తు అంతా బీఆర్ఎస్‌దేనని చెప్పారు. వాగ్దానాలను నిలుపుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉండదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నెలదాటింది. అధికారంలోకి వచ్చిన తెల్లారినుంచే హామీలను అమలు చేస్తామని ప్రకటించిన ఆ పార్టీ.. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా కాలాయపన చేస్తున్నది. కాంగ్రెస్ నెల రోజుల పాలనా పోకడలే అందుకు సాక్ష్యం. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో అప్పుడే అసహనం ప్రారంభమైంది. హామీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ మీద ఒత్తిడి తెస్తూ రాష్ట్ర ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది. ఆ దిశగా బీఆర్ఎస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉంటేనే మరింత పోరాట పటిమ చూపగలమని కేటీఆర్ అన్నారు. ఉద్యమంలో గట్టిగా పోరాడిన చరిత్రను గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధికారంలో ఉండటం కన్నా ప్రతిపక్షంలో ఉండటమే కాంగ్రెస్ పార్టీకి ప్రమాదకరమని చెప్పారు. రెండుమూడు నెలలకోసారి అన్ని స్థాయిల కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు రాజకీయ అస్థిత్వంగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను గెలిపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలం లోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. 'తెలంగాణ గళం బీఆర్ఎస్. తెలంగాణ బలమూ బీఆర్ఎస్సే. బీఆర్ఎస్ వేయబోయే ప్రతి అడుగులో కేసీఆర్ దళంగా ఐకమత్యంగా ముందుకు సాగుదాం. తెలంగాణ సాధించిన ఘనతకు, వెలుగొందుతున్న ప్రభకు ఏమాత్రం భంగం

## నియోజన్ కంపెనీ సహకారం అభినందనీయం

### మాదారం సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్



**పటాన్ చెరు, జనవరి 10 (సమ సమాజం):** పటాన్ చెరు నియోజన కంపెనీ సిఎస్ఆర్ నిధులతో మాదారం గ్రామపంచాయతీ పరిధిలో రైతులకు ఆరు బోర్లు వేసి మరిన్ని పంటలు పండించేందుకు సహకరిస్తున్న కంపెనీ ప్లాంట్ మేనేజర్ నరేష్ వారి యజమా న్యానికి గ్రామ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో రైతులకు బోర్లు వేయడం ద్వారా రైతులు మరెన్నో పంటలు పండించేందుకు ఆస్కారం ఉంటుందని రైతుకు లాభం చేకూర్చేలా సహకరించినందుకు అలాగే గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడుతున్నందుకు పటాన్ చెరు నియోజన కంపెనీ యజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భగవాన్ సింగ్, భాస్కర్, గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో కొత్త విద్యుత్ పాలసీ

**వివిధ రాష్ట్రాల విద్యుత్తు విధానాలపై అధ్యయనం ■ పక్కాగా విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు ■ నిరంతర విద్యుత్..గృహజ్యోతిపై సీఎం రేవంత్ సమీక్ష**



హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): తెలంగాణలో కొత్త విద్యుత్ పాలసీ తేవాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారు. విద్యుత్తు రంగ నిపుణులు, వివిధ రాష్ట్రాల విద్యుత్తు విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాసనసభలో చర్చించి తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర విద్యుత్తు విధానాన్ని అమలు చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి.శ్రీధర్ బాబులతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో విద్యుత్తు వినియోగం, 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరా, విద్యుత్తు సంస్థల ఉత్పత్తి, కొత్తగా ఉత్పత్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల్లో ఇచ్చిన గృహజ్యోతి పథకానికి 2వందల యూనిట్లను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు వంటివాటిపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, వివిధ విద్యుత్ కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, డిస్కమ్లు పనితీరు, ఆర్థిక పరిస్థితిపైనా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి ఇప్పటిదాకా విద్యుత్ కంపెనీలకు, విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) మధ్య జరిగిన ఒప్పందాలు, ఆ ఒప్పందాల్లోని అంశాలు, విద్యుత్తుకు చెల్లించిన ధరలు వంటివాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, పూర్తి వివరాలను అందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్థిక సంవత్సరాల వారీగా జరిగిన ఒప్పందాలను, వాటిలోని అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కువ ధర చెల్లించే విధంగా జరిగిన ఒప్పందాలకు కారణాలేమిటో కూడా నివేదించాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందో, ఆ కంపెనీల నుంచే విద్యుత్ కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటిదాకా సరైన విద్యుత్ పాలసీని రూపొందించడకపోవడంతో వివిధరకాల ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్తు విధానాలను అధ్యయనం చేయాలని, ఆ రాష్ట్రాల్లోని విద్యుత్తు పరిస్థితులు, మెరుగైన విధానం ఏ రాష్ట్రంలో ఉందో అధ్యయనం చేసి, నివేదికలను ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన విద్యుత్తు విధానాన్ని తెలంగాణలో అమలుచేయడానికి నిపుణులతో చర్చించి, అసెంబ్లీలోనూ అన్ని రాజకీయపార్టీల ప్రజా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి, సరికొత్త విద్యుత్ పాలసీని తీసుకు వస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ పరంగా విద్యుత్తు ఉత్పత్తిని పెంచడానికి, మరిన్ని విద్యుత్ సంస్థలను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నాణ్యతను పెంచాలని సూచించారు. విద్యుత్తును నిరంతరం సరఫరా చేయడంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా పటిష్టంగా, ముందస్తు చర్యలను చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## పచ్చదనం పెంపు నిరంతర కార్యక్రమం

**33 శాతం పచ్చదనం కోసం కృషి**

**అటవీ అధికారులకు మంత్రి కొండా సురేఖ నిర్దేశం**



హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంచే కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. హరితహారం పై ఇప్పటి దాకా జరిగిన పురోగతి, రానున్న సీజన్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో మంత్రి సమక్షించారు. అటవీ, గ్రామీణ అభివృద్ధి, మునిసిపల్, హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి, హార్టీ కల్చర్, ఉన్నతాధి కారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతరాయ పక్రియ అని మంత్రి తెలిపారు. లక్షిత 33 శాతం పచ్చదనం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మొక్కలు నాటడం, నర్సరీలు, అటవీ సంబంధిత కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఇంటి అవసరాలకు ఉపయోగపరమైన, అలాగే కనీస ఆదాయాన్నిచ్చే మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ ప్రాంతానికి చెందినటువంటి పూలు పండ్ల జాతుల మొక్కల పంపిణీ తో పాటు, స్వచ్ఛందంగా పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమ ఆవరణలో చెట్లు నాటుకున్న వాళ్లకు కనీస ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలని తెలిపారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చింత, సీతాఫల్, ఉసిరి, జామ, నిమ్మ, సపోటా, మునగ, కరివేపాకు లాంటి మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు. హరితహారం కార్యక్రమం పారదర్శకంగా పూర్తి జవాబుదారీతనంతో ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. గతంలో జరిగిన తప్పులను సవరించుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నాటుతున్న మొక్కలు వాటి ఎదుగుదల, అలాగే చనిపోయిన మొక్కలను మార్చే విధానం అన్ని కూడా వీలైనంత త్వరగా ఆన్ లైన్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మీక్షా సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పిసిసిఎఫ్ ఆర్.ఎం. దొబ్రియాల్, సుభద్ర, కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 13 నుంచి పరేడ్ గ్రౌండ్స్‌లో కైట్ ఫెస్టివల్

**సిఎం రేవంత్‌ను ఆహ్వానించిన మంత్రి జూపల్లి**



హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం): తెలంగాణ పర్యాటక శాఖ ఆద్వర్యంలో నిర్వహించే ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌కు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కలిసి ఆహ్వానించారు. మంత్రితోపాటు యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్. మామిడి హరికృష్ణ, తదితరులు కలిశారు. జనవరి 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కైట్ ఫెస్టివల్ జరగనుంది.ఈ ఫెస్టివల్ కు మూడు రోజుల సమయమే ఉండటంతో అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఇప్పటికే వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రతినిధులతో ఈ ఫెస్టివల్ పై మంత్రి జూపల్లి చర్చించారు.

## అక్రమంగా చేరిన వారు వెళ్లిపోండి

**దొంగ ఉద్యోగులకు మంత్రి పొన్నం హెచ్చరిక**

**కొత్త బస్సుల కొనుగోలుకు రంగం సిద్ధం**



కరీంనగర్, జనవరి 10 (సమ సమాజం): జెన్ కో తోపాటు ఇతర డిపార్ట్ మెంట్ లో అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారు.. వెంటనే ఉద్యోగాలు వదిలిపెట్టి వెళ్ళాలని లేకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ అండ్ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చారించారు. బుధవారం జిల్లా పట్టణంలో మంత్రి మార్నింగ్ వాక్ చేస్తూ.. వాకర్స్ తో కలిసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరిగితే బిఆర్ఎస్ నేతల్లో దడ పుడుతుందని.. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు 9 నెలలు కూడా పనిచేయలేదని విమర్శించారు. ప్రాజెక్టు అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని చెప్పారు. బిఆర్ఎస్ ను కాపాడేందుకు బిజెపి నేతలు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చి నెలరోజులు అవుతుందని.. గ్యారెంటీ స్కీంలపై ధరఖాస్తులు స్వీకరించామని.. చిత్తశుద్ధితో వందశాతం అమలు చేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ అంత సచ్చీలుడైతే.. తనపై వచ్చిన ఆరోపణపై పోలీసులకు ఫిర్యాదు చేసి.. తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. భూ అక్రమాలపై చర్యలు చేపడుతామని మంత్రి అన్నారు. ఇదిలావుంటే బస్సుల్లో మహిళల ఫ్రీ జర్నీకి పెరుగుతున్న రద్దీ కారణంగా 275 బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిసెంబర్ లో 80 బస్సులు ప్రారంభించాం..ఇపుడు మరో 275 బస్సులు కొనుగోలు చేస్తున్నాం.. వీటికి అదనంగా జూలై చివరి నాటికి మరో 1000 కొత్త బస్సులు నడుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని బలోపేతంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేశామని తెలిపారు. మహిళలకు ఫ్రీ జర్నీ పథకానికి మంచి రెస్పాన్స్ వస్తుందన్నారు. ఇప్పటి వరకు 9 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. బస్సులో ప్రయాణం చేసే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.

## తృతీయ ఆర్థిక వ్యవస్థగా భారత్

**గుజరాత్ అంతర్జాతీయ సదస్సులో మోడీ**



గాంధీనగర్, జనవరి 10 (సమ సమాజం): భవిష్యత్తులో ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ ఏజెన్సీల అధ్యయనంలో ఈ విషయం వెల్లడైందని తెలిపారు. బుధవారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన 'గుజరాత్ అంతర్జాతీయ సదస్సు 2024'లో ప్రధాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జయిద్ అల్ నహ్యాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రాక భారత్-యూఏఈ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోదీ అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్థిరత్వానికి మూల స్తంభంగా, విశ్వమిత్రగా, సమస్యలకు పరిష్కారాలు కనుగొనగలిగే సాంకేతిక కేంద్రంగా, ప్రతిభావంతులైన యువత కలిగిన శక్తివంతమైన కేంద్రంగా భారత్‌ను అంతర్జాతీయ సమాజం చూస్తోంది. ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశిరచుకుని వాటిని సాధించగలమనే భావనను ప్రపంచ దేశాలకు భారత్ కలిగించిందని అన్నారు. ఇటీవలే భారత్ 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను చేసుకుంది. రాబోయే 25 ఏళ్లు భారత్‌కు అమృత కాలం. ఈ 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రపంచంలో భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనేందుకు నాది భరోసా అని ప్రధాని మోదీ తెలిపారు. భారత చరిత్రలో నరేంద్ర మోదీ అత్యంత విజయవంతమైన ప్రధాని అని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు. గుజరాత్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఆయన.. ప్రధాని నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. 'భారతీయులు ఎక్కువగా 'మోదీ హైతో ముమ్‌కిన్ హై'అని ఎందుకు అంటున్నారని విదేశాల్లోని మిత్రులు నన్ను అడుగుతారు. దానికి నేను చెప్పే సమాధానం.. భారత ప్రధాని తన సంకల్పంతో సవాళ్లను అధిగమించి అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేశారు. అందుకే భారతీయులు మోదీ హైతో ముమ్‌కిన్ హై అంటారని చెప్పానని తెలిపారు.

## అయోధ్య ప్రతిష్టాపనకు మేము రాం

**బిజెపి రాజకీయం చేయడం మాకు ఇష్టం లేదు● విస్పష్టంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ**



న్యూఢిల్లీ, జనవరి 10 (సమ సమాజం): అయోధ్యలో రామ మందిర్ ప్రారంభోత్సవానికి దూరంగా ఉండాలని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. ఏఐసీసీ ఛీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, అదిర్ రంజన్ చౌదరి హాజరు కావడం లేదని కాంగ్రెస్ ప్రకటించింది. నిర్మాణాలు పూర్తికాకుండానే రాజకీయ లబ్ది కోసమే రామ్ మందిర్ ప్రారంభిస్తున్నారని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయ లబ్ది కోసమే కార్యక్రమం నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. కోట్లాది మంది సెంటిమెంట్‌ను తాము గౌరవిస్తాం.. అయోధ్యపై రాజకీయాన్ని మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రాముడిని దేశంలో లక్షలాది మంది పూజిస్తారు. కానీ మతం అనేది వ్యక్తిగత విషయం. కానీ ఆర్ఎస్ఎస్ , బీజేపీ చాలాకాలంగా అయోధ్యలోని ఆలయాన్ని రాజకీయ ప్రాజెక్టుగా తయారు చేశారని ఆరోపించారు. అసంపూర్తిగా నిర్మించిన అయోధ్యను బీజేపీ,ఆర్ఎస్ఎస్ ప్రారంభించడం ఎన్నికల లబ్దికోసమే ముందు ప్రారంభిస్తున్నారని స్పష్టమవుతోంది. అయితే తాము 2019 సుప్రీంకోర్టుకు కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 22న ప్రారంభం కానున్న అయోధ్య రామ మందిర్ ప్రారంభానికి హాజరుకావాల్సిందిగా మల్లికార్జున ఖర్గే, సోనియ గాంధీ, అధిర్ రంజన్ చౌదరికి ఆహ్వానం అందింది. ఈ క్రమంలో హాజరుకావడం లేదని ప్రకటించింది. అది భాజపా, ఆర్ఎస్ఎస్‌కు చెందిన పొలిటికల్ ప్రాజెక్ట్ అని వ్యాఖ్యానించింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధరికి ఆహ్వానం అందిన సంగతి తెలిసిందే. ఈ ఆహ్వానాన్ని వారు తిరస్కరించారని కాంగ్రెస్ తెలిపింది. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈవెంట్ అని, ఇది ముమ్మాటికి ఎన్నికల మైలేజీ కోసం చేపట్టిన స్టంట్ అని విమర్శించింది. దీనిపై పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని లక్షలాది మంది రాముని ఆరాధిస్తారని, మతం అనేది వ్యక్తిగత అంశమని ఆయన పేర్కొన్నారు. అయితే చిరకాలంగా అయోధ్యలోని రామాలయాన్ని రాజకీయ ప్రాజెక్టుగా బీజేపీ మార్చిందని ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న రామాలయ ప్రారంభోత్సవాన్ని ఎన్నికల ప్రయోజనాల కోసమే బీజేపీ, ఆర్ఎస్ఎస్ తెరపైకి తెచ్చిందన్నారు. 2019 సుప్రీంకోర్టు తీర్పును, రాముని ఆరాధించే కోట్లాది మంది భక్తుల మనోభావాలను కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అయితే ఇది స్పష్టంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యక్రమంగా మార్చినందున మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, అధీర్ రంజన్ చౌదరి మర్యాద పూర్వకంగా ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్టు జైరామ్ రమేష్ ఆ ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా.. 2024 జనవరి 22న జరిగే ప్రారంభోత్సవం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాముడి విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా గర్భగుడిలోకి తీసుకురానున్నారు. కాశీకి చెందిన పండిట్ లక్ష్మీకాంత్ దీక్షిత్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇక ప్రారంభోత్సవానికి తాము దూరంగా ఉంటామని సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్ వెల్లడించిన నిర్ణయం.. భాజపా, హస్తం పార్టీ మధ్య మాటల యుద్ధానికి దారితీయనుందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరోపక్క విపక్ష 'ఇండియా' కూటమిలోని తృణమూల్ కాంగ్రెస్ కూడా తాము హాజరుకావడం లేదని చెప్పింది. ఇవన్నీ భాజపాకు సానుకూలంగా మారనున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in